## క్లుప్తంగా

### రోడ్డు ఆక్రమణ తొలగింపు



ప్రహరీగోడను తొలగిస్తున్న గ్రామస్తులు

ఏర్పేడు: మండలంలోని పల్లంగొల్లపల్లె రోడ్డు ఆక్రమణను బుధవారం గ్రామస్తులు తొలగించారు. పల్లంపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పల్లంగొల్లపల్లెకు మట్టిరోడ్డు ఉంది. పల్లంపేటకు చెందిన ఓ మహిళ రోడ్డును ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించింది. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లలేకపోతున్నాయి. ఆగ్రహించిన గ్రామస్తులు, మహిళలు అక్రమంగా నిర్మించిన ప్రహరీగోడను తొలగించారు. సమస్యను రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు.

### అవార్డు గ్రహీతకు సన్మానం



సన్మానం అందుకున్న దేవరాజులు

ఏర్పేడు: జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న మండలంలోని పాతవీరాపురం ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రిమేకల దేవరాజులను వేఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘన సన్మానించారు. నిబద్ధత, అంకిత భావంతో పనిచేస్తూ 7 సంవత్సరాలపాటు తెలుగు సబ్జెక్ట్‌లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించడం, కవిగా, రచయితగా 4 పుస్తకాలను రచించి తెలుగు సాహిత్యంలో గుర్తింపు రావడంతో ఆయన జిల్లా అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతుల ద్వారా అవార్డు అందుకున్నారు. బుధవారం తిరుపతి యూత్ హాస్టల్‌లో దేవరాజులును వేఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. వైఫౌండేషన్ అధినేత పైడి అంకయ్య, ఎంఈఓ–2 దయాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శరీర సౌష్టవ పోటీల్లో ప్రతిభ



ప్రశంసా పత్రం, పతకంతో సునీల్

సత్యవేడు: తమిళనాడు రాష్ట్రంలోని పట్టాభిరాంలో నిర్వహించిన అండర్ –21 అంతర్రాష్ట్ర శరీర సౌష్టవ పోటీలో మండలంలోని పెద్ద ఈటిపాకం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యురాలు సెల్వి, రమణయ్య కుమారుడు సునీల్ పంచమ స్థానాన్ని సాధించాడు. ఫిట్‌నెస్ పార్థిబన్ క్లాసిక్ 2022–23 బాడి బిల్డర్ ఈవెంట్ చెన్నై నిర్వాహకుల నుంచి సాయి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. పోటీల్లో 20 మంది పోటీ పడగా 5వ స్థానంలో నిలిచి పతకం సాధించాడు. సునీల్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు అభినందించారు.


### సిపాయి భరోసా అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం గ్రామానికి చెందిన కాళహస్తి మునెమ్మ కుటుంబానికి బుధవారం సిపాయి భరోసాను తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అందజేశారు. మునెమ్మ (54) ఇటీవల మృతి చెందింది. ఆ గ్రామానికి సుబ్రమణ్యం వెళ్లి తన ఆధ్వర్యంలో నడుస్తున్న సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడే 40 రకాల నిత్యావసర సరకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెంబేటి మునిరత్నంరెడ్డి, మునిబత్తిరెడ్డి, మణిరత్నం, దామోదరంరెడ్డి, సుబ్బమ్మ, తులసి పాల్గొన్నారు.

### వరసిద్ధుని బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



సుపథ మండపంలో పెయింటింగ్ పనులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం స్వామివారి పుష్కరిణిని పరిశుభ్రం చేయించారు. అలాగే ఆలయంలోని సుపథ మండపంలో పెయింటింగ్ పనులు చేపట్టారు. ఈనెల 18 నుంచి 21 రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగనున్న విషయం తెలిసిందే.

# మా దేవుడు నువ్వేనయ్యా..






చెక్కుల పంపిణీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ముఖ్యమంత్రి జగనన్నకు జేజేలు పలుకుతున్న కార్మికులు

రేణిగుంట: 'ఒకనాడు నాలుగు నియోజకవర్గాల చెరకు రైతులతో మమేకమై, మమకారం పెనవేసుకుని... వారి పంటచేళ్లలో పండిన చెరకుతో చక్కెర ఆడించిన తీపి గురుతులు వారివి... రెండు దశాబ్దాల పాటు చక్కెర కర్మాగారాన్ని దిన, దినాభివృద్ధి చేసి ఓ వెలుగు వెలిగిన నాటి స్థితిగతులు ఇంకా వారి మెదళ్లలోనే కదలాడుతున్నాయి. అయితే స్వార్థ రాజకీయాలకు తల్లి లాంటి కర్మాగారం మూతపడడంతో తల్లడిల్లిపోయారు.. ఉపాధి కోల్పోయి వీధిన పడి బతుకు భారమై, తిండికి అలమటించిన రోజులు గడిపిన దయనీయ పరిస్థితులు చవిచూశారు. గాఢాంధకారం అలుముకున్న కార్మికుల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగుపూలు పూయించే దివిటీగా మారారు.. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. 368 మంది కార్మికులకు చెందిన 9ఏళ్ల వేతన బకాయిలు రూ.21.36కోట్లు విడుదల చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. రేణిగుంట మండలం గాజులమండ్యం ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు చెక్కులు అందుకుని 9ఏళ్ల తమ నిరీక్షణకు రాష్ట్ర ముఖ్యమంత్రి సముచిత న్యాయం చేశారని మదినిండా సంతోష డోలికల్లో మునిగితేలారు. మాదేవుడు నువ్వేనయ్యా అంటూ ఆనందం వ్యక్తం చేశారు.

#### జగనన్నపై ఉంచిన నమ్మకం వృథా పోలేదు



మాది రేణిగుంట మండలం గాజులమండ్యం. మా ఆయన ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీలో పనిచేసి రిటైర్ అయ్యి చనిపోయారు. 9ఏళ్లుగా వేతన బకాయిల కోసం కార్మికులు ఎన్నో ఉద్యమాలు చేశారు. అయినా ఎవ్వరూ పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక, మాకు న్యాయం చేస్తారని నమ్మకం ఏర్పడింది. ఈ రోజు జగనన్న దయ వల్ల రూ.22,11, 917 చెక్కును అందుకున్నాను. చాలా సంతోషంగా ఉంది. ఇకపై మా జీవితాలు మరోలా మారనున్నాయి. జగనన్నకు ఆజన్మాంతం రుణపడి ఉంటాం.

–ఎం.సుమతి, గాజులమండ్యం

#### 9ఏళ్ల నిరీక్షణ ఫలించింది



2014లో చంద్రబాబునాయుడు ఉన్నట్టుండి ఫ్యాక్టరీని మూసివేయడంతో అందరం రోడ్డున పడ్డాం. ఉపాధి కరువై, జీతాలు లేక చాలా బాధలు పడ్డాం. వేతన బకాయిల కోసం ఏళ్ల తరబడి పోరాటాలు చేశాం. ప్రాధేయపడ్డాం. ఎవ్వరూ మా బాధలను పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనసుతో పెండింగ్ వేతన బకాయిలను చెల్లించారు. నేను రూ.9లక్షల 9వేలు చెక్కును అందుకున్నా.

–కె.షణ్ముగం, ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ కార్మికుడు

#### చాలా సంతోషంగా ఉంది



వేతన బకాయిలు అందకుండా చాలా ఇబ్బందులు పడ్డాం. ఉపాధి కోల్పోయి అవస్థలు ఎదుర్కొన్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా బాధలను గుర్తించి మాకు బకాయిలను చెల్లించడం ఆనందంగా ఉంది. నేను 1982నుంచి మెకానిక్ హెల్పర్‌గా పనిచేశాను. నేను రూ.13లక్షల 62వేలు చెక్కు అందుకున్నాను. చాలా ఆనందంగా ఉంది.

–జయచంద్రయ్య, ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ కార్మికుడు

#### పండుగ వాతావరణం కనిపిస్తోంది



గాజులమండ్యం ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు వేతన బకాయిలను చెల్లించడంతో పండగ వాతావరణం కనిపిస్తోంది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. 368 మంది కార్మికులకు రూ.21.36కోట్లు విడుదల చేసి గొప్ప మనసును చాటుకున్నారు. గత ఎండీ దురుద్దేశంతో కొందరు కార్మికులకు కన్సాలిడేట్ కార్మికులకు సరైన వేతనాలు వేయకుండా బిల్లులు పెట్టడంతో కొందరు నష్టపోయారు. ఈ విషయాన్ని మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లి వారికి కూడా న్యాయం జరిగేలా కృషి చేశారు. –రవిబాబు, ఎండీ, ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ, గాజులమండ్యం

# సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు



సాధనవారిపాళెం రోడ్డును పరిశీలిస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: మండలంలోని సాధనవారిపాళెంలోకి వెళ్లే మట్టి రోడ్డును సిమెంటు రోడ్డుగా మార్చేందుకు జిల్లా అధికారులతో మాట్లాడుతానని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. బుధవారం గ్రామస్తుల వినతి మేరకు సాధనవారిపాళెం రోడ్డును పరిశీలించారు. గ్రామస్తుల ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 750 మీటర్లు పొడవు కలిగిన మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యేలా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతానని తెలిపారు. తక్షణమే గుంతలు పూడ్చి సాఫీగా రాకపోకలు సాగే విధంగా మరమ్మతులు చేపట్టాలని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డికి సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ అంతరాయం లేకుండా సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్‌ను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబు రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, ఆయకట్టు మాజీ చైర్మన్ లక్ష్మణ్ రెడ్డి, సర్పంచులు దుడ్డు వేణు, రమణయ్య, కిషోర్, నందయ్య, సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ శివా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**పలువురికి పరామర్శ**

మండలంలో ఎమ్మెల్యే ఆదిమూలం సుడిగాలి పర్యటన చేశారు. పలు గ్రామాల్లో పలువురు పార్టీ శ్రేణులను పరామర్శించారు. చిలమత్తూరులో పార్టీకి చెందిన వెంకటేష్ తల్లి రెడ్డి చెంగమ్మ కర్మక్రియల కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీఎల్ఎన్‌పల్లెలో రెండు రోజుల కిందట మృతి చెందిన ఆటో యూనియన్ నాయకుడు లోకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం ద్వారా పక్కా ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎల్ఎన్‌పల్లెలో అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతిలో ఉన్న మాజీ సర్పంచ్ యన్నం విజయ్ కుమార్‌ను పరామర్శించారు. సాధనవారిపాళెంలో ఇటీవల బైకు ప్రమాదంలో గాయపడిన గ్రామ వలంటీర్‌ను కూడా ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇందిరానగర్ పంచాయతీలో వాటర్‌మెన్‌గా బాధ్యతలు చేపడుతూ అనారోగ్యానికి గురైన రమణయ్యను పరామర్శించి, తక్షణమే పింఛన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

## నేడు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

నారాయణవనం: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గురువారం సాయంత్రం శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆస్థానం నిర్వహిస్తున్నట్లు ఆలయ టీటీడీ అధికారి నాగరాజు తెలిపారు. గురువారం సాయంత్రం ఊంజల్ మండపంలో శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మాడవీధుల్లో తిరుచ్చి వాహనంపై ఊరేగింపు ఉంటుందన్నారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత కల్యాణ వెంకన్నతో కలిసి శ్రీకృష్ణుని ఊరేగింపు ఉంటుందని, పదహారు కాళ్ల మండపం వద్ద ఉట్లోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. యువకులు ఉట్లోత్సవంలో పాల్గొనాల ఆయన కోరారు.

# గోకుల కృష్ణా..గోపాల కృష్ణా..



బీఎన్‌కండ్రిగ: ఉట్టికొడుతున్న చిన్నారులు





బీఎన్‌కండ్రిగ: విశేషాలంకరణలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి, ఏర్పేడు: రాధాకృష్ణుల వేషధారణ



శ్రీకాళహస్తి: శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. కేరింతల నడుమ ఉట్టి కొట్టారు. పాఠశాల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే సంస్కృతి, అలవాట్లు పిల్లలకు అర్థమయ్యే రీతిలో వివరించే దిశగా ఆయా పండుగల సమయంలో తమ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయుడు మునిరత్నంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నపిల్లలు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు. ఉట్టి కొట్టారు. మండల కేంద్రంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

ఏర్పేడు: స్థానిక ఓం నారాయణ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ చింత మోహన్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణుని చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# కీర్తి.. స్ఫూర్తిదాయకం

- కీర్తి కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటాం
- కీర్తి మృతదేహానికి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళి
- అశ్రునయనాలతో అంత్యక్రియలు



కీర్తి మృతదేహం



రామాపురంలో కీర్తి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: 'ప్రాణం పోయినా మరొకరికి జీవితం ఇవ్వాలనే ఆలోచన మృత్యుంజయునిగా జీవించేలా చేస్తుంది.. తన అవయువాలను దానం చేసి ఏడుగురు ప్రాణాలు కాపాడి పదిమందిలో చైతన్యం తీసుకొచ్చేలా కీర్తి ఆదర్శంగా నిలిచింది.. కీర్తి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది'.. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే రామాపురం చేరుకుని కీర్తి భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. 'మాకు అన్నం పెట్టే కుమార్తె పరిస్థితి చూడు అన్నా'.. అంటూ కీర్తి తల్లిదండ్రులు బోరుమని విలపించారు. ఎమ్మెల్యే వెంటనే సీఎం కార్యాలయానికి, జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డికి ఫోన్ చేసి కీర్తి అవయవాల దానం, ఆమె కుటుంబం పరిస్థితులను వివరించారు. ఏడుగురు ప్రాణాలు కాపాడిన కీర్తి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఇందుకు సీఎం కార్యాలయం, కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబాన్ని పోషించే పెద్దకుమార్తెను పోగొట్టుకున్న తల్లిదండ్రులు సంపత్‌కుమార్, అమ్ములు తమ అనంత శోఖాన్ని కడుపులో దాచుకొని అవయవాలు దానం చేసేందుకు అంగీకరించడం గొప్ప విషయమన్నారు.

**పలువురు సాయం**

కీర్తి కుటుంబానికి ఎమ్మెల్యే, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆర్థిక సాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రూ.12 వేలు, తహసీల్దారు మధుసూదన్ రావు, ఎంపీడీఓ శ్రీనివాసులు రూ.10 వేలు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు రూ.5 వేలు నగదును అందించారు. కీర్తి పార్థివదేహానికి సాయంత్రం కుటుంబ సభ్యులు అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి, ఎంపీటీసీ రమేష్ రాజు, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, నాయకులు పాలపద్మనాభం, చలపతిరాజు, విశ్వనాథం, శేఖర్ వెంకటేశన్ పాల్గొన్నారు.

#### అవయవదానంపై కీర్తికి ఆసక్తి..



అవయవదానంపై కీర్తికి ఆసక్తి ఉండేది. అవయవదానం వల్ల మరికొందరికి జీవితాన్ని ప్రసాదించవచ్చని అంటుండేది. చివరికి ఆమెకే ఇలా జరుగుతుందని మేము అనుకోలేదు. ఆమె బతికి ఉన్నప్పుడు మాతో, ఆమె స్నేహితులతో పంచుకున్న ఆలోచనలను నెరవేర్చినట్లుంది.

–కీర్తి తండ్రి, సంపత్ కుమార్, రామాపురం

#### చేతికందిన బిడ్డ వెళ్లిపోయింది..



20 ఏళ్లుగా పెంచి పోషించిన మా బిడ్డ కీర్తి, మమ్మల్ని పోషించే సమయంలో వదిలిపోయింది. ప్రస్తుతం ఆమె జీతంతోనే మా కుటుంబం నెట్టుకొస్తుంది. మమ్మల్ని పోషించడంతో పాటు ఆమె చెల్లెలు, తమ్ముడును బాగా చదివించాలనుకుంది. అంతలోపే తిరిగిరాని కోకాలకు వెళ్ళిపోయింది.

– కీర్తి తల్లి అములు, రామాపురం

#### ఇది రెండవ గౌరవ వందనం



చెన్నై రాజీవ్ గాంధీ జనరల్ ఆస్పత్రి చరిత్రలో కీర్తి పార్థివ దేహానికి తాము చేసింది రెండవ గౌరవ వందనం. తాము మరణించి మరికొంత మందికి జీవితాన్ని అందించవచ్చన్న ఆలోచన ప్రజల్లో కల్పించాలని ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఇలాంటి వ్యక్తులకు గౌరవ వందనం చేయడం సముచితంగా భావిస్తున్నాం.

–తేరణి రాజన్, ప్రిన్సిపల్, రాజీవ్‌గాంధీ జనరల్ ఆస్పత్రి, చెన్నై

# సింహ వాహనంపై అవనాక్షమ్మ విహారం



సింహవాహనంపై అవనాక్షమ్మ

నారాయణవనం: సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ అవనాక్షమ్మ ఆలయ వార్షిక జాతరలో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారు సింహ వాహనాన్ని అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. గత నెల 22వ తేదీ మంగళవారం సాయంత్రం జాతర సందర్భంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 రోజుల పాటు నిర్వహించే జాతరలో చివరి మూడు రోజుల అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైన అమ్మవారు సింహవాహనం అధిరోహించి గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. గురువారం రాత్రి అమ్మవారు సముదాయం, నారాయణవనం ఎగువ, దిగువ శెంగుందర్ వీధుల్లో, చివరి రోజైన శుక్రవారం రాత్రి సముదాయం, కీళగరం, నారాయణవనంలో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు.

**పద్మావతీ వెంకన్నలు కొలిచిన అవనాక్షమ్మ**

శ్రీపద్మావతీ అమ్మవారి తండ్రి ఆకాశరాజు అవనాక్షమ్మను కొలిచేవారు. వేటకై వచ్చిన వెంకన్న పద్మావతీ అమ్మవారిని మోహించి నారాయణవనంలో వివాహమాడినట్లు వరాహపురాణం పేర్కొంటోంది. ఈ సందర్భంగా అవనాక్షమ్మ ఆలయంలో పద్మావతీ అమ్మవారు గౌరీపూజ చేశారని, వివాహంఅనంతరం కల్యాణ వెంకన్న పద్మావతీ అమ్మవారితో కలిసి అవనాక్షమ్మను దర్శించుకుని కొలిచినట్లు ఇతిహాసాలు పేర్కొంటున్నాయి. ఆలయంలో అమ్మవారికి తమిళ ఆవణి నెలలో 15 రోజుల పాటు జాతరను, శరన్నవరాత్రుల్లో 10 రోజుల పాటు ఉత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది.

### స్పెషల్ సెక్రటరీకి సాదర స్వాగతం



పూనం మాలకొండయ్యకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పూనం మాలకొండయ్యకు బుధవారం రాత్రి రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఆమెకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరి వెళ్లారు.

# టీడీపీ ఆరోపణలు అర్థరహితం



కార్యక్రమం పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: టీడీపీ మండల నాయకుల ఆరోపణలు అర్థ రహితమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మణినాయుడు, వైస్ ఎంపీపీ బాబురెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో టీడీపీ నాయకుల ఆరోపణలను వైఎస్సార్ సీపీ శ్రేణులు తీవ్రంగా ఖండించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సహకారంతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో మండలం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు అవాస్తవ ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు కన్నయ్యనాయుడు టీడీపీ ప్రభుత్వ హయంలో ఇసుక అక్రమణ రవాణా చేసి రూ.లక్షలు లూటీ చేశారని, నీరు–చెట్టు పనుల్లో, నాసిరకమైన సీసీరోడ్డు వేసి ప్రభుత్వ నిధులు స్వాహా చేశారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అవినీతి జరిగిందని ఆరోపించారు. ఇకపై వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సురుటుపల్లి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు అజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు హరిబాబు, చలపతి, మునస్వామి, తులసీ, దేవదాసురెడ్డి, ఇమామ్ బాషా, గిరిరెడ్డి, హరిప్రసాద్, వెంకటయ్య, తిరుపాల్, లక్ష్మీపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ అభ్యున్నతికి సైనికుల్లా పనిచేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కలసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కుటుంబంతో సమానమని, చిన్న చిన్న మనస్పర్థలు వస్తూ పోతుంటాయని, అలాగే పార్టీలోను నాయకుల మధ్య చిన్న చిన్న మనస్పార్థలుంటే సర్దుకుపోవాలని సూచించారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకోస్తే పరిష్కరిస్తానని, పార్టీ బాగుంటేనే అందరూ బాగుంటారని తెలిపారు. పార్టీలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వనని హామీ ఇచ్చారు. పార్టీ మండల కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మణినాయుడు, సోషల్ మీడియ తిరుపతి జిల్లా కన్వీనరు రాకేష్, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, గురునాథం, గురవయ్య, ప్రసాద్‌పాల్, అజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రవి, గిరి, ఇమామ్‌బాషా, మునిరాజా పాల్గొన్నారు.